# తెలంగాణ వాణి 20వ వసంతంలోకి అడుగు

- సెప్టెంబర్ 15లోపు సావనీర్ ఆవిష్కరణకు సన్నాహాలు..
- హనుమకొండలో పాత్రికేయ మిత్రుల ఆత్మీయ సమావేశం




**తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో,(ఆగస్టు 5 )** : తెలంగాణ వాణి దినపత్రిక 19వ వసంతాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని 20వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సావనీర్ రూపకల్పనకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 15వ తేదీలోపు సావనీర్‌ను సిద్ధం చేసి ఆవిష్కరించేందుకు పత్రిక యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా హనుమకొండలోని హరిత హోటల్ లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన తెలంగాణ వాణి పాత్రికేయ మిత్రులతో సన్నాహక, ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ వాణి దినపత్రిక ఎడిటర్ జెరిపోతుల సంపత్ ముఖ్యఅతిథిగా, నెట్‌వర్క్ ఇంచార్జ్ అఫ్జల్ పఠాన్ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో డాక్టర్ మోటె చిరంజీవి సభాధ్యక్షత వహించగా, ధరుముల తిరుపతి, గంగుల రాజిరెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

### ప్రజల పక్షాన తెలంగాణ వాణి అక్షర ప్రస్థానం

సమావేశంలో తెలంగాణ వాణి దినపత్రిక ఎడిటర్ జెరిపోతుల సంపత్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా తెలంగాణ వాణి పత్రికా రంగంలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి బాధ్యతాయుతమైన సమాచారాన్ని అందించడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పత్రిక ఇంతకాలం కొనసాగడానికి యాజమాన్యంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు, సిబ్బంది, పాఠకులు, ప్రకటనదారులు, శ్రేయోభిలాషుల సహకారం ప్రధాన కారణమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ వాణిని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. పాత్రికేయులు వృత్తిపరంగా మరింత ఉన్నత ప్రమాణాలను పాటించాలని సూచిస్తూ, వార్తల సేకరణ, నిర్ధారణ, ప్రచురణలో జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా ప్రింట్‌తో పాటు డిజిటల్ వేదికలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

### సావనీర్ రూపకల్పనలో ప్రతి రిపోర్టర్ భాగస్వామి కావాలి

నెట్‌వర్క్ ఇన్‌చార్జి అఫ్జల్ పఠాన్ మాట్లాడుతూ తెలంగాణ వాణి 20వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రూపొందించనున్న సావనీర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. సావనీర్‌లో తెలంగాణ వాణి ప్రస్థానం, పత్రికా రంగంలో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులపై పాత్రికేయులు రాసే విశ్లేషణాత్మక, సంపాదకీయ వ్యాసాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రకటనలు, యాడ్స్ సేకరణపైనా పాత్రికేయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ వాణి యూట్యూబ్ ఛానల్, వెబ్ న్యూస్, ఈ-పేపర్ తదితర డిజిటల్ వేదికల గురించి వివరించారు. ప్రస్తుతం పాఠకులు వార్తలను కేవలం ప్రింట్ పత్రిక ద్వారానే కాకుండా డిజిటల్ మాధ్యమాల ద్వారా కూడా విస్తృతంగా అనుసరిస్తున్న నేపథ్యంలో ప్రతి రిపోర్టర్ డిజిటల్ జర్నలిజంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా పాత్రికేయులకు సంబంధించిన అక్రిడేషన్ కార్డులు, వాటి ప్రాధాన్యత, అవసరమైన ప్రక్రియలు తదితర అంశాలపై కూడా వివరించారు.

"సావనీర్ అనేది కేవలం ఒక పుస్తకం కాదు.. తెలంగాణ వాణి 20 ఏళ్ల అక్షర ప్రస్థానానికి ప్రతిబింబం. అందులో ప్రతి రిపోర్టర్ భాగస్వామ్యం కనిపించాలి" అని అఫ్జల్ పఠాన్ అన్నారు. సావనీర్ రూపకల్పన విజయవంతం కావడానికి ప్రతి రిపోర్టర్ తనవంతు బాధ్యతగా భావించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.




### సలహాలు, సూచనలు పంచుకున్న పాత్రికేయులు

సమావేశానికి హాజరైన రాష్ట్రంలోని వివిధ జిల్లాల పాత్రికేయ మిత్రులు తెలంగాణ వాణి భవిష్యత్ ప్రస్థానంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పత్రికను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వార్తా కవరేజీలో ఎదురవుతున్న సమస్యలు, డిజిటల్ మీడియా విస్తరణ, వెబ్ న్యూస్, ఈ-పేపర్ అభివృద్ధి, సావనీర్ రూపకల్పన తదితర అంశాలపై తమ సలహాలు, సూచనలు అందించారు. పాత్రికేయుల సూచనలను యాజమాన్యం సానుకూలంగా స్వీకరించి, భవిష్యత్ కార్యాచరణలో వాటిని పరిగణనలోకి తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

### ఆత్మీయంగా సాగిన సమావేశం

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సుదీర్ఘంగా సాగిన ఈ సన్నాహక, ఆత్మీయ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పాత్రికేయ మిత్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ వాణి 20వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రికను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పాత్రికేయులు పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన ముఖ్యఅతిథులు, ఆత్మీయ అతిథులు, ఇతర అతిథులను తెలంగాణ వాణి ప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ, పత్రిక భవిష్యత్ ప్రస్థానంపై చర్చించుకున్నారు. 20 ఏళ్ల అక్షర ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. ప్రజల గొంతుకగా, పాత్రికేయ విలువలకు ప్రతీకగా తెలంగాణ వాణి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సమావేశంలో ఆకాంక్షించారు.

